




నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ కృష్ణా
సోమవారం 15 సెప్టెంబర్ 2025 పేజీలు 8



## ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న
# హాస్పిటల్స్, మెడికల్స్, ల్యాబ్స్

- రోగులను పిప్పిచేసేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు
- అక్కరలేని టెస్టులు, అర్థంకాని మందుల చీటీలు
- అధిక రేట్లు, నకిలీ మందులతో మెడి'కిల్స్'
- ఆచూకీలేని వైద్య నియంత్రణ అధికారులు

వివరాలు 2లో



### స్త్రీ శక్తితో సాధికారతకు
# సరికొత్త ఉత్తేజం..

- పథకం భేష్ అంటూ ఆనందం, సంతృప్తి వ్యక్తం చేస్తున్న మహిళామణులు
- లబ్ధిదారులతో ముచ్చటించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ బ్యూరో, సెప్టెంబర్ 14, మేజర్ న్యూస్ :** స్వాతంత్ర్య దినోత్సవం రోజున రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతంగా అమలవుతోందని.. స్త్రీ శక్తితో మహిళా సాధికారతకు సరికొత్త ఉత్తేజం వచ్చిందని, లబ్ధిదారులు ఆనందంతో చెబుతున్న మాటలే ఇందుకు నిదర్శనమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

2లో..

### వెంకటేశ్వర స్వామి ఆస్తులపై
# ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



- దసరా, విజయవాడ ఉత్సవ్ కోసం మాత్రమే వినియోగం
- భవిష్యత్తులోనూ ఆలయానికి ఆదాయం వచ్చేలా ప్రణాళికలు
- స్వామివారి సమక్షంలోనే ఒప్పందం చేసుకోవడం హర్షణీయమన్న మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం గొడుగుపేటలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి గొల్లపూడిలో ఉన్న ఆస్తులను పరిరక్షించడంతో పాటుగా, ఆలయానికి ఆదాయం సమకూర్చేలా ప్రణాళికలు రచిస్తున్నామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ మేరకు మచిలీపట్నం గొడుగుపేటలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విజయవాడ ఉత్సవ్ కమిటీ ప్రతినిదులు అందించిన రూ.45 లక్షల చెక్కును స్వామి వారి పాదాల వద్ద ఉంచారు. స్వామివారి ఆస్తుల్ని వినియోగించుకుంటున్నందుకు గానూ ఈ మేరకు చెల్లిస్తున్నామంటూ తెలిపారు. మచిలీపట్నంలోని గొడుగుపేట శ్రీ భూనీలా సమేత వేంకటేవ్వరస్వామి విజయవాడ సమీపంలోని గొల్లపూడిలో ఉన్న 40 ఎకరాల భూమి అన్యాక్రాంతం చేస్తున్నారంటూ వస్తున్న వార్తలను మంత్రి కొల్లు రవీంద్ర ఖండించారు. దశాబ్దాలుగా బూముల ద్వారా ఆదాయం లేకుండా పోయిందన్నారు. దసరా సెలవులను పురస్కరించుకుని వైబ్రేంట్ విజయవాడ సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ ఉత్సవాల ఎగ్జిబిషన్ నిర్వహణకు అవసరమైన స్థలాన్ని వారు వినియోగించుకోవడానికి అనుమతి కోరారు. దసరా ఉత్సవాలతో పాటుగా, విజయవాడ ఉత్సవాల నిర్వహణ కోసం 56 రోజులకు రూ.45 లక్షలు చెల్లించేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగింది. అదే సమయంలో రైతులకు రూ.15 లక్షలు చెల్లించడం

2

# ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న హాస్పిటల్స్, మెడికిల్స్, ల్యాబ్స్

## రోగులను పిప్పిచేసేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు

## అక్కరలేని టెస్టులు, అర్థంకాని మందుల చీటీలు

## అధిక రేట్లు, నకిలీ మందులతో మెడి'కిల్స్'

## ఆచూకీలేని వైద్య నియంత్రణ అధికారులు

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** వైద్యులే దేవుళ్ళు... ఆస్పత్రులే దేవాలయాలుగా భావిస్తుందీ, పుజిస్తుందీ, గౌరవిస్తుందీ సమాజం... కానీ రక్షించవలసిన ఆస్పత్రులు, వైద్యులే ప్రజల రోగాలను ఆసరా చేసుకుని భక్షించేస్తున్న తీరు. ప్రైవేట్, కార్పోరేట్ ఆస్పత్రులు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు ధన దాహంతో రోగుల శక్తిని హరించి వేస్తున్నాయి. అర్హత, సామర్థ్యం, అనుమతులు వున్నా లేకున్నా ఆపరేషన్లు యథేచ్ఛగా చేసేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. అదేవిధంగా ఆపరేషన్ల పేరిట, డెలివరీల పేరిట అనవసర రిస్కు హడావుడి చూపిస్తూ వేలకువేలు దండుకుంటున్నాయి. రోగికి రక్తం ఎక్కించాలంటూ హడావుడి చేసి రక్త దాతల, నిల్వకేంద్రాల వైపు పరుగులు పెట్టిస్తారు. సేకరించిన, కొనుగోలు చేయించిన రక్త సంచులను వాడకుండా రక్త నిల్వ కేంద్రాలకు రీసెల్లింగ్ చేసేస్తారు. పరీక్షా కేంద్రాలతో కుమ్మక్కై అవసరం లేకున్నా ఎక్స్ రే, ఇసిజి, స్కానింగ్, పరీక్షలు చేయిస్తారు. పరీక్షల పేరుతో ఆస్పత్రులు, పరీక్షా కేంద్రాలు అధికరేట్లు వసూలుచేసి వాటాలు పంచుకొంటూ ప్రజలను దోచేస్తున్నాయి. డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా, సీజనల్ వ్యాధులు విజృంభించేవేళ పరీక్షా కేంద్రాలు ప్రైవేటు, కార్పొరేట్ అస్పత్రుల అక్రమాలకు, అగడాలకు అడ్డాలుగా మారిపోయాయి. మందుల షాపుల్లో, ల్యాబుల్లో పనిచేసిన వాళ్ళు కొందరు రోగుల యిండ్లవద్దే స్వంతవైద్యం అందిస్తూ దండుకుంటున్నారు. ప్రజల అమాయకత్వమే ఆసరాగా మందులు వాడించి లేనిజబ్బులు అంటగడుతూ దోపిడీచేస్తున్నారన్న ఆరోపణలు మిక్కుటంగానే వున్నాయి, మందుల షాపుల టార్గెట్స్ కొరకు అక్కరలేని రకరకాల మందులు మార్చి మార్చి వ్రాస్తూ పేద ప్రజలను ఆర్థికంగా గుల్లచేస్తున్న దాఖలాలున్నాయి. చికిత్సలు, ఆపరేషన్ల పేరిట మందులచీటీ చాంతాడులా పెంచి వ్రాస్తూ వేలాది రూపాయలు దోచేస్తున్నారు. ఆపరేషన్ థియేటరులో, ఇన్-పేషెంటుగా ముందస్తుగా వాడామనిచెప్పి రోగులచేత కొనిపించిన మందులు నర్సింగ్ సిబ్బందే మందుల షాపుల్లోకి తరలింపు చేస్తారు. అలాగే కోర్సు మందులు, ఇంజక్షన్లు కొనుగోలు చేయించి రెండో, మూడో వాడి మిగిలినవీ సిబ్బందే తస్కరిస్తారు. మందుల కంపెనీలు మెడికల్ రిప్రజెంటరీల ద్వారా యిచ్చిన శాంపిల్సు ముందస్తుగా రోగులకు వాడతారు. వాటి స్థానంలో ఖరీదైన మందులు కొనుగోలు చేయించి వాటినీ మందుల షాపులలోకి తరలించేస్తారు. మందుల కంపెనీలు కొత్తగా ప్రవేశపెట్టిన మందుల శాంపిల్స్ రోగులపై ప్రయోగించి పరీక్షిస్తున్న ప్రయోగశాలలు గానూ ఆస్పత్రులు మారిపోయాయి, యిక ప్రిస్క్రిప్షన్ రాతలు దేవుడికే అర్థంకాని రీతిలో వుంటాయి. రోగులకు అర్థమయ్యేలా పెద్ద అక్షరాలతో మందుల చీటీలు వ్రాయాలన్న మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, కోర్టుల ఆదేశాలు భేఖాతరు.

**మెడీ "కిల్స్ :** 300, 500 డాక్టర్ ఫీజు చెల్లించలేక మందుల కొరకు షాపులకెళ్ళిన అమాయక పేదప్రజలను అధికరేట్లతో అందినకాడికి దండుకుంటూ వున్నాయి. అలాగే వైద్యుల చీటీలు (ప్రిస్క్రిప్షన్స్) లేకుండా మందులు విక్రయించరాదన్న నిబంధనలను మెడికల్ షాపులు తుంగలో తొక్కేస్తున్నాయి. నిరక్షరాసులు, గిరిజనులు, వృద్ధుల అవసరాలు ఆసరాగా మందుల చీటీలు ఉన్నా, లేకున్నా మందులకు అధిక మొత్తంలో డబ్బు గుంజేస్తున్నాయి. హెరీల్ సేల్ డ్రగ్ వ్యాపారులు, మెడికల్ షాపుల నిర్వాహకులు కలసి నకిలీ మందుల దందా కొనసాగిస్తున్నారు. రశీదు యిచ్చే, బ్యాచ్ నంబర్లు పేర్కొనే పరిస్థితి లేనందున నకిలీ మందుల దందాకు అడ్డూ అదుపూ లేనేలేదు. గ్రామాల్లో ఎన్నో మెడికల్ షాపులు లైసెన్సులు లేకుండా మందులు విక్రయం చేస్తున్నాయి. మెడికల్ షాపులవద్ద కొని, షాపుల నిర్వాహకులే చేసిన ఇంజక్షన్లు వికటించి రోగులు చనిపోవడంతో మెడికల్ షాపుల నిర్వాహకులే లక్షల రూపాయలు యిచ్చి రాజీ చేసుకున్న దాఖలాలు ఎన్నో. మెడికల్ షాపుల్లో డ్రెస్ కోడ్ పాటించక, గ్లౌలు వేసుకోకుండా ఫార్మసిస్టులు మందులను విక్రయం చేస్తున్నారు. ఫ్రీజర్స్ లోనే భద్రపరచాల్సిన కొన్ని మందుల పట్ల నిర్లక్ష్యం కానసాగుతోంది. వినియోగదారుడికి తప్పక యివ్వవలసిన మందుల వివరాలు, బ్యాచ్ నంబర్లతో కూడిన రశీదులు యివ్వడంలేదు. మందులు వికటిస్తే షాపులకు, వైద్యానికి, అనువత్రులకు యిబ్బందిగా మారుతాయనే, అధిక ధరల దోపిడీ బయట వడుతుందనే వినియోగదారులకు రశీదులు యివ్వకుండా ఉద్దేశపూర్వక మోసాలకు పాల్పడుతూ రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. యిదంతా ప్రైవేటు ఆస్పత్రులే స్వతంత్రంగా ఏర్పాటు చేసుకుని సాగిస్తున్న మెడి"కిల్స్" అక్రమ దందా.

**జాడలేని తనిఖీ నిబంధనలు :** తుంగలో తొక్కుతున్న ఆసుపత్రులు (నర్సింగ్ హెరీమ్స్), వైద్యులు, లాబ్ లు, మెడి'కిల్స్ పై వైద్య, ఆరోగ్య శాఖ, ఔషధ నియంత్రణ విభాగ అధికారుల నిఘా పూర్తిగా కొరవడింది. అర్హతలు, అనుమతులు ఎవరికి వున్నాయి. ఎవరు నిబంధనలు అతిక్రమించి వైద్యం, వ్యాపారం జరిగిస్తున్నారు, ఏమి మందులు ఎలా విక్రయం చేస్తున్నారనే విషయాలపై తనిఖీలు లేకపోవడం అవినీతి, అక్రమాలకు ఊతమిస్తోంది. అలాగే ప్రైవేట్ హాస్పిటల్స్ లో రోగుల ఓపి, బపి రిజిస్టర్లు, కేస్ షీట్లు, ల్యాబ్ రిపోర్టులు, రిఫర్ చేసిన రోగుల వివరాలు, వసూలు చేస్తున్న ఫీజుల పట్టికలు, రశీదులు, రిజిస్టర్లు తప్పక నిర్వహించేలా, మెడికల్ షాపుల్లో కంప్యూటర్ రశీదులు యిచ్చేలా, నియమ నిబంధనలు పాటించని హాస్పిటల్స్, ల్యాబ్ లు, మెడికల్ షాపులపై చర్యలు చేపట్టాలని ప్రజానీకం డిమాండ్ చేస్తోంది.



## స్త్రీ శక్తితో సాధికారతకు సరికొత్త ఉత్తేజం..

(మొదటిపేజీ తరువాయి)

ఆదివారం కలెక్టర్ లక్ష్మీశ విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌ను సందర్శించి వివిధ మార్గాల్లో వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బస్సుల్లోని మహిళా ప్రయాణికులతో మాట్లాడారు. మీరు ఎక్కడికి వెళ్తున్నారు.. పథకం ఎలా ఉంది.. ఏమైనా సమస్యలున్నాయా.. మిమ్మల్ని ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా? అంటూ మాట కలిపారు. విద్యార్థులతోనూ ముచ్చటించారు. పథకం చాలా బాగుందని, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేవంటూ ముఖంపై చిరునవ్వుతో బదులిచ్చారు. ఏవైనా ఇబ్బందులుంటే 1100 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేసి చెప్పొచ్చని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ విద్య, ఉద్యోగం, ఉపాధి, ఇతర అవకాశాలకోసం ఆర్థిక భారం లేకుండా బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తూ సాధికారతతో సరికొత్త మైలురాళ్లను చేరుకుంటున్నారన్నారు. విద్య అనేది మనిషి జీవితానికి వెలుగునిస్తుందని.. బాలికా విద్యను కూడా ప్రోత్సహించేందుకు ఈ పథకం దోహదం చేస్తోందన్నారు. ప్రయాణ ఖర్చుల ఊసే లేకుండా తమ పనులను చక్కదిద్దుకుంటూ ఆర్థిక ప్రగతిలో భాగస్వాములవుతున్నారని.. ఇంత మంచి పథకం ప్రవేశపెట్టిన గౌరవ ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

## వెంకటేశ్వర స్వామి ఆస్తులపై ఆందోళన చెందాల్సిన అవసరమే లేదు





(మొదటిపేజీ తరువాయి)

హర్షణీయం. ఈ మేరకు కలెక్టర్ ఆధ్వర్యంలో ఒప్పందం చేసుకున్నాం. 56 రోజుల అనంతరం భూముల్ని ప్రభుత్వానికి స్వాదీనం చేసేలా ఒప్పందం చేసుకున్నాం. అవసరం మేరకు కోటి వ్యయంతో చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించాం. 7ఎకరాలకు సంబంధించి కోర్టులో ఉన్న వివాదాలను కూడా వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆ దేవదేవుడి భూములను పరిరక్షించడం మా తక్షణ కర్తవ్యం. అందుకోసం అవసరమైతే ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, సదరు భూమి ద్వారా ఆలయానికి ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకుంటాం. 99 సంవత్సరాలకు లీజుకు ఇచ్చామనే వాదన పూర్తిగా అవాస్తవం. భూముల ద్వారా ఆలయానికి ఆదాయం సమకూర్చడం, తద్వారా ఆలయాన్ని మరింతగా అభివృద్ధి బాటలో నడిపిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ మాట్లాడుతూ. తెలుగువారి సంస్కృతి, కళలను ప్రజలందరికీ అందించే లక్ష్యంతో విజయవాడ ఉత్సవ్ నిర్వహిస్తున్నాం. సాంస్కృతిక పర్యాటక కేంద్రంగా విజయవాడను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రచిస్తున్నాం. దసరా ఉత్సవాలు అంటే అందరికీ మైసూర్ గుర్తొస్తుంది..

అదే విధంగా విజయవాడలో నిర్వహించాలనుకుంటున్నాం. దేవాలయ స్థలం విషయంలో అపోహలు నెలకొనడం బాధాకరం. ఆలయ కమిటీ సభ్యులందరితో చర్చించిన తర్వాతే ఆలయానికి ఆదాయం కల్పించే నిర్ణయం తీసుకోవడం జరిగింది. అని ఎంపీ శివనాథ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, కొమ్మరెడ్డి పట్టాభి రామ్, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, బీజేపి పార్టీ అసెంబ్లీ కన్వీనర్ సోడిశెట్టి బాలాజీ, మచిలీపట్నం మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్ బాబాప్రసాద్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుంచె నాని, గొడుగుపేట వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ వడ్లమూడి లక్ష్మీనరసింహరావు, వైబ్రేంట్ విజయవాడ సంస్థ ప్రతినిధిగా మురళి పాల్గొన్నారు.

# రాజకీయ ఉనికి కోసం, జగన్ మెప్పు కోసం ఎంపీ కేశినేని శివనాథ్‌పై అవాస్తవ ఆరోపణలు

**విజయవాడ మేజర్ న్యూస్ :** విజయవాడ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయటానికి, విజయవాడ సంస్కృతి వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ విజయవాడ ఉత్సవ్ నిర్వహించేందుకు కృషి చేస్తుంటే.... వైసిపి నాయకులు దేవినేని అవినాష్, వెల్లంపల్లి శ్రీనివాస్ తమ రాజకీయ ఉనికి కోసం, జగన్ మెప్పు కోసం అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని టిడిపి నేతలు మండిపడ్డారు. విజయవాడ ఉత్సవ్ లో భాగంగా ఎగ్జిబిషన్ కోసం మచిలీపట్నంలోని గొడుగుపేట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన గొల్లపూడిలో ని 40 ఎకరాల భూమిని 56 రోజులు వినియోగించుకుంటున్నందుకు రూ.45 లక్షలు చెల్లించటం జరిగిందన్నారు. విజయవాడ ఉత్సవ్ కి సంబంధించి ఎంపీ కేశినేని శివనాథ్ పై వైసిపి నేతలు దేవినేని అవినాష్, వెల్లంపల్లి శ్రీనివాస్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి కొట్టేటి హనుమంతురావు, టిడిపి రాష్ట్ర నాయకులు మాదిగాని గురునాథం, విజయవాడ అర్బన్ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు జి.వి. నరసింహారావు కలిసి ఆదివారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టేటి హనుమంతురావు మాట్లాడుతూ దేవినేని అవినాష్ పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ముందుగా అవినాష్ రాజకీయ పరిజ్ఞానం పెంచుకుని వాస్తవాలు గ్రహించి మాట్లాడాలన్నారు. జగన్ మోహన్ రెడ్డి మెప్పుకోసం నిత్యం పార్లమెంట్ అభివృద్ధి కాంక్షించే ఎంపీ కేశినేని శివనాథ్ పై అవాస్తవ ఆరోపణలు చేస్తే ప్రజలు చూస్తూ వుండరని హెచ్చరించారు. దేవినేని అవినాష్ కు తెలుగుదేశం పార్టీ రాజకీయ భిక్ష పెట్టిందనే విషయం మర్చిపోయి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ఐదేళ్లకొకసారి ఏ పార్టీ మారతాడో తెలియని అవినాష్ కి నిత్యం విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమించే ఎంపీ కేశినేని శివనాథ్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. విజయవాడ కు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చేందుకు కృషి చేస్తుంటే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు.



స్థలాలను కబ్జా చేసే వైసిపి నాయకుల మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. అనంతరం జి.వి. నరసింహారావు మాట్లాడుతూ ఎంపీ కేశినేని శివనాథ్ సంకల్పంతో పన్నెండేళ్ల తర్వాత విజయవాడలో ఎగ్జిబిషన్ మొదలు కానుందన్నారు. నగర ప్రజలు ఎంపీ కేశినేని శివనాథ్ కృషికి అభినందనలు తెలుపుతున్నారన్నారు. వైసిసి నాయకులు నగరాభివృద్ధి చూసి ఓర్చుకోలేకపోతున్నారనటానికి ఈ అవాస్తవ ఆరోపణలే ఉదాహరణ అన్నారు. దేవదాయ శాఖ మంత్రి గా పనిచేసినప్పుడు ఆ శాఖ గురించి మాట్లాడని వెల్లంపల్లి ఈ రోజు మొసలి కన్నీరు కారిస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరంటూ ఎద్దేవా చేశారు. సంవత్సరానికి రూ.5 లక్షలు ఆదాయంకూడా రానీ ఆ దేవదాయ భూమికి 56 రోజులకి 45 లక్షలు చెల్లించి వినియోగించుకుంటున్న విషయం వైసిపి నేతలు తెలుసుకుని మాట్లాడాలని హెచ్చరించారు. మాదిగాని గురునాథం మాట్లాడుతూ జగన్ మెప్పు కోసం మాత్రమే మాట్లాడే దేవినేని అవినాష్, వెల్లంపల్లి శ్రీనివాస్ లను ప్రజలు ఎప్పుడో తిరస్కరించారని..ఆ విషయం గ్రహించి మాట్లాడాలన్నారు. లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రజల ఆస్తులను, ప్రభుత్వం భూములను కబ్జా చేయటం వైసిపి నాయకులకి అలవాటన్నారు. దమ్ముంటే ఎంపీ కేశినేని శివనాథ్ చేసిన ఆరోపణలు నిరూపించాలని సవాల్ విసిరారు. లేని పక్షంలో రాజకీయ సన్యాసం తీసుకోవాలన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ పై అవాస్తవాలు మాట్లాడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో విజయవాడ అర్బన్ మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు ఎం.డి ఇర్ఫాన్ కూడా పాల్గొన్నారు.

# భద్రత, పరిశుభ్రతలో రాజీపడే ప్రసక్తే లేదు






**ఆహార భద్రతా ప్రమాణాలు పక్కాగా పాటించాల్సిందే**

**సూచిక బోర్డులు సరైన విధంగా ఏర్పాటు చేయాలి**

**ప్రతి స్టాల్ తప్పనిసరిగా ధరల పట్టికలను ప్రదర్శించాలి**

**ప్రయాణికుల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించాలి**

**పంటిడ్ నెహ్రూ బస్టాండ్‌లో కలెక్టర్ లక్ష్మీశ ఆకస్మిక తనిఖీలు**




**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 14, మేజర్ న్యూస్ :** ప్రయాణికుల భద్రత, బస్టాండు పరిశుభ్రతలో రాజీపడే ప్రసక్తే లేదని.. ఆహార పదార్థాల విక్రయశాలలు కచ్చితంగా ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాల్సిందేనని.. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హెచ్చరించారు. ఆదివారం కలెక్టర్ లక్ష్మీశ విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాట్‌ఫాంలతో పాటు తాగునీటి పాయింట్లు, మరుగుదొడ్ల పరిసరాలను పరిశీలించారు. ఏ సమయంలోనైనా అపరిశుభ్రత అనే మాట వినిపించకూడదని.. ప్రయాణికుల ఆహార భద్రతకు భరోసాకల్పించేలా పరిశుభ్రతా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పక్కా ప్రణాళికలతో నిరంతర పర్యవేక్షణతో ప్రయాణికులు సంతృప్తి చెందేలా సౌకర్యాలతో సేవలందించాలన్నారు. ప్రాంగణంలోని దుకాణాలు, స్టాళ్లు తప్పనిసరిగా ధరల పట్టికలను ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రయాణికులకు చాలా సులభంగా అర్థమయ్యేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పాత డస్ట్ బిన్ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని.. ఈగలు, దోమలు లేకుండా యాంటీ లార్వాల్ చర్యలు, పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి అని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు.

## కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రధమ వర్ధంతి సభ



**గన్నవరం, సెప్టెంబర్ 14, మేజర్ న్యూస్ :** కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రధమ వర్ధంతి సభ గన్నవరం మండల ఆధ్వర్యంలో దావాజీ గూడెం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సభకు విజ్ఞాన కేంద్ర బాధ్యులు అనుమోలు వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. వికేఆర్ కాలేజీ రిటైర్డ్ లెక్చరర్ గన్నె వెంకటరావు, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు పాల్గొని ఉపన్యాసించారు. లెక్చరర్ గన్నె వెంకటరావు మాట్లాడుతూ.. భారతదేశం ఈరోజు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో, సీతారాం ఏచూరి చేసిన సేవలు అపారమని అన్నారు. యూపీఏ ప్రభుత్వ కాలంలో సిపిఎం పార్టీ వైఖరి పేద వర్గాల కోసం అనేక చట్టాలను తీసుకురావడంలో కీలకంగా నిలిచిందని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ..ఈ దేశంలో ప్రజాస్వామ్యం దిగజారుతున్న తరుణంలో సిపిఎం పార్టీ మాత్రం పేద ప్రజలతో కలిసి ఉద్యమాలను నిర్మిస్తోందని అన్నారు. దేశం పెట్టుబడిదారుల వైపు వంగిపోతున్నప్పటికీ, సిపిఎం పార్టీ పేద వర్గాల తరపున నిరంతరం పోరాడుతూనే ఉందని ఆయన పేర్కొన్నారు. సభలో మండల సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరుని దర్శనానికి భక్తుల తాకిడి



**గుడ్లవల్లేరు సెప్టెంబరు 14 మేజర్ న్యూస్:** డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం స్వామివారి దర్శనానికి భక్తుల తాకిడి అధికమైంది. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలను మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణ నడుమ వైభవంగా వేద పండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ పూజల్లో అధికసంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు ఉన్నారు.

## గ్రోమోర్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ బాలాజీ



**గుడ్లవల్లేరు సెప్టెంబరు 14 మేజర్ న్యూస్:** గుడ్లవల్లేరు గ్రామంలోని మన గ్రోమోర్ ఫెర్టిలైజర్స్ ను జిల్లా కలెక్టర్ డికె బాలాజీ ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శిం చారు. ఈ సందర్భంగా గ్రోమోర్ లో యూరియా నిల్వలను పరిశీలించిన కలెక్టర్ బాలాజీ గుడ్లవల్లేరు గ్రామంలో యూరియా పరిస్థితిపై వివరణ కోరగా యిప్పటికే రెండు విడ తలుగా యూరియా పంపిణీ చేసామని, తహశీల్దార్ ఆదేశాలతో పిఏసిఎస్, ఎరువుల దుకాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, యూరియా పంపిణీని పరిశీలిస్తున్నామని, మూడవ విడత కేటాయింపు కొరకు చూస్తున్నామని, ప్రస్తుతం ఎటువంటి కొరత లేదని, రైతులకు ఎటువంటి యిబ్బంది లేదని, వివరాలు తెలిపిన గుడ్లవల్లేరు విఆర్వో శాయన ప్రకాష్ ను అభినందించారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న గుడ్లవల్లేరు పిఏసిఎస్ అధ్యక్షులు యెని గళ్ళ నాగేశ్వరరావు మూడవ విడత యూరియా విడుదల త్వరితంగా యివ్వా లని కోరగా, 18వతేదీకల్లా పంపిస్తామని కలెక్టర్ తెలిపారు. ఎంఆర్ఓ కార్యాల య సీనియర్ సహాయకులు పి.శివకుమార్, గ్రోమోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నేత్రవైద్యశిబిరం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం 176వ ఉచిత కంటి శుక్లముల వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ మోహనరావు 50 మందికి పరీక్షలు నిర్వహించి 21మందిని ఐఓఎల్ శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. వీరికి అమరావతి ఆసుపత్రిలో ఆపరేషన్లు నిర్వహించేం దుకు ఏర్పాట్లు చేశారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మాజేటి అమరవాణి, గోళ్ల వెంకటరత్నం, మలిశెట్టి చెం చురాములు, దీంటకుర్తి జ్యోతి, కుసుమ, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, గోళ్ల ద్రోణపూర్ణచంద్రరావు, ఉరిమి రమేష్, సువర్చల, రాధికలు సేవలందించారు.

## టీటీడీ పాలకమండలి సభ్యుడిగా టీవీఎస్ మోటార్ కంపెనీ ఛైర్మన్ సుదర్శన్ వేణు



**విజయవాడ మేజర్ న్యూస్ :** టీవీఎస్ మోటార్ కంపెనీ ఛైర్మన్ సుదర్శన్ వేణును తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి సభ్యుడిగా నియమితులయ్యారు. ఇది టీటీడీ ట్రస్ట్ బోర్డులో ఆయన రెండవ పదవీకాలాన్ని సూచిస్తుంది. పదవీ ప్రమాణ కార్యక్రమంలో ఆయన తండ్రి వేణు శ్రీనివాసన్, ఆయన భార్య తారా వేణు కూడా ఉన్నారు. ఇటీవల టీవీఎస్ మోటార్ కంపెనీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా వేణు పదోన్నతి పొందిన తర్వాత ఈ నియామకం జరిగింది. ఇది భారతీయ బహుళజాతి తయారీదారులో కుటుంబ నిరంతర నాయకత్వ వారసత్వాన్ని నొక్కి చెబుతుంది.

## సీనియర్ న్యాయవాది అనిస్ అహ్మద్ రజా మృతి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది, మచిలీపట్నం కార్పొరేషన్ మాజీ స్టాండింగ్ కౌన్సిల్ అహ్మద్ రజా(60) ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆంధ్రజాతియ కళాశాలలో ఇంటర్ డిగ్రీ చదివిన అనీష్ హిందూ లా కాలేజీలో 1990లో డిగ్రీ పొందారు. గత 35 సంవత్సరాలుగా మచిలీపట్నం బార్ అసోసియేషన్ లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. మాజీ జిల్లా ప్రభుత్వం న్యాయవాది కాళీపట్నపు సుందర రామమూర్తి వద్ద జూనియర్ గా పనిచేశారు. అనేక సివిల్ క్రిమినల్ కేసులు వాదించి పేదల పక్షాన న్యాయాన్ని పొందటంలో అన్నిస్ తనకంటూ మంచి పేరు సంపాదించుకున్నారు. మచిలీపట్నం మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ గా పలు కేసులలో విజయం సాధించారు. ముఖ్యంగా మైనార్టీ హక్కులు పరిరక్షణ కోసం కృషి చేశారు. ఆదివారం ఉదయం దేశాయిపేట ముస్లిం స్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి. అనిస్ మృతుదేహానికి పలువురు రాజకీయ పార్టీ నాయకులు మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఘనంగా నివాళులు అర్పించారు. అనిస్ కు కుమారుడు కుమార్తె సాఫ్ట్వేర్ ఇంజనీరులు.

## మెగా లోక్ అదాలత్‌లో కేసులకు పరిష్కారం చూపడంలో విశేష ప్రతిభ చూపిన ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** మెగా లోక్ అదాలత్ ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన రాజీ చేయదగిన కుటుంబ తగాదాలు, రహదారి ప్రమాదాలు, పెట్టి కేసులు, ఇతర కేసులను ఇరుపక్షాల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఉత్తమ మార్గమని, ఎక్కువ పెండింగ్ లో వున్న కేసులను, అన్నికేసుల లోని ఇరుపక్షాల వారితో మాట్లాడి ఎక్కువ కేసులు ఈ లోక్ అదాలత్ లో పరిష్కరించే విధంగా చూడాలని ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి తగిన సూచనలు, ఆదేశాలను ఇచ్చారు. శనివారం గౌరవ న్యాయస్థానం వారు నిర్వహించిన మెగా లోక్ అదాలత్ లో నగర పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బంది కలిసి ఎన్.టి.ఆర్.జిల్లాలో వివిధ కేసులయిన ఐ.పి.సి. కేసులు -449, స్పెషల్ యాక్ట్ కేసులు - 506, పెట్టి కేసులు-3047 మొత్తం 4003 కేసులలో పరిష్కారం చూపడం జరిగింది. 4003 కేసులలో కక్షిదారులు, ఫిర్యాదుదారులను, ఇరువర్గాల సభ్యులను సమన్వయం చేసుకుంటూ వారితో మాట్లాడి వారి యొక్క కేసులను ఈ లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా పరిష్కారం చూపే విధంగా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎన్.టి.ఆర్.జిల్లా పోలిస్ కమీషనర్ అభినందించారు.

## నేడు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన సదస్సు

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** తక్కువ శ్రమ, తక్కువ పెట్టుబడితో అత్యధిక దిగుబడులు, ఆదాయాన్ని ఇచ్చే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ప్రవాస భారతీయులు మండవ శేషగిరిరావు, రైతునాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీలు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కృష్ణాజిల్లా ఉద్యానవనశాఖ అధికారిణి జె. జ్యోతి, ఘంటసాల కేవీకే సంచాలకులు డా.డి.సుధారాణి, డా.వి.మంజువాణి, ఉండవల్లి ఆగ్రో ఫార్మ్స్ జీఎం బి. హరికృష్ణలు సదస్సులో పాల్గొననున్నట్లు వివరించారు. వక్క, కొకో, ఆయిల్పామ్, పనస పంటల సాగులో ఉన్న అవకాశాలు, ఉపయోగాలు, లాభాలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఈ సదస్సులో రైతులు పాల్గొనాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు.



## మండలి వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకలు

**నాగాయలంక సెప్టెంబర్ 14 మేజర్ న్యూస్ :** నాగాయలంక గ్రామంలో దివిసిమ గాంధీ స్వర్గీయ మండలి వెంకటకృష్ణారావు శతజయంతి వేడుకల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈరోజు ముఖ్యఅతిథిగా విచ్చేసిన భ ర్రెంకుల గ్రామ వాస్తవ్యులు గోపాలం.వెంకటేశ్వరరావు మండలి వెంకట కృష్ణారావు, విగ్రహానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి నారు.అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడుతూ,ప్రతి ఒక్కరూ ఆయన చేసిన సేవా కార్యక్రమాలు దివిసీమ ప్రాంత ప్రజలకు ఎప్పటికీ మరువ రని, ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడుచు కో వాలని, నడవాలని ప్రసంగించారు. ఈ 42వ రోజు జరిగిన కార్యక్రమంలో కూటమి సభ్యులైన తలశిల.స్వర్ణలత, మెండు లక్ష్మణరావు భావ దేవరపల్లి సర్పంచ్ మండలి.ఉదయభాస్కర్, గుడివాక శివరావు, బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు గుడివాక శివాజీ బిజెపి సీనియర్ నాయకులు చన్నగిరి. లతా మోహన్, తాడేపల్లి. పాపారావు, ముక్కొల్లు శివరావు, తలశిల.రామకృష్ణ (చౌదరి మాస్టర్), ఉప్పల.ప్రసాద్, బండ్రెడ్డి సుబ్బారావు పిరాటి. శ్రీనివాసరావు.షేక్ జానీ భోగి రెడ్డి.బుజ్జి తోట.మానస, రేమాల.బాబురావు, మాదివాడ.అర్జున్ రావు, మండలి అభిమానులు పాల్గొని తదా నంతరం మండలి అభిమానులకు మిఠాయిలు పంచి కార్యక్రమాన్ని జయప్రదం చేసినారు.

## నేటి నుండి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



### యలమర్రులో ప్రారంభించనున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ సోమవారం నుండి అక్టోబర్ 15వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను అందిస్తున్నట్లు సహాయ సంచాలకులు డా.జీవీ నరసిం హారావు తెలిపారు. పెదపారుపూడి మండలం యలమర్రు గ్రామంలోని ఏరియా పశు వైద్యశాలలో సోమవారం ఈ కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, గ్రామ ఉపస ర్పంచ్ సూరపనేని వెంకట సత్యనారాయణ లు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. పెదపారుపూడి, నందివాడ మండలాల పరిధిలోగల 18, 005 పశువులకు ఇంటింటికి వెళ్లి తమ వైద్య సిబ్బంది గాలికుంటు వ్యాధి నివా రణ టీకాలను వేస్తారని చెప్పారు. కావున రైతులు ఈ అవకాశాన్ని వినియో గించుకుని తమ పశువులకు ఈ టీకాలను వేయించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సాంబిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని చాగంటిపాడు గ్రామ శివారు కళ్ళేంవారి పాలెంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు కళ్ళేం సాంబిరెడ్డి భార్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పరామర్శించారు. సోమవారం సాంబిరెడ్డి ఇంటికి వెళ్లిన కుమార్ రాజా కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కళ్లెం వంశీధర్ రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీకొండలమ్మ సన్నిధిలో ఎస్ఐ సత్యనారాయణ కుటుంబం





**గుడ్లవల్లేరు సెప్టెంబరు 14 మేజర్ న్యూస్:** కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో ది:14.09.2025 ఆదివారం సందర్భంగా శ్రీ అమ్మవారిని సుమారు 20,000 పైగా భక్తులు దర్శించుకొనినారు. శ్రీ అమ్మవారిని ధర్శించుకోనుటకు విచ్చేసిన భక్తులు శ్రీ అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి యొక్క మొక్కుబడులు తీర్చుకొనినారు. శ్రీ అమ్మవారి దేవస్థానమునకు విచ్చేసిన భక్తులకు త్రాగు నీరు, ఉచిత ప్రసాదము భక్తులకు అందజేయుట జరిగినది. అదేవిధంగా శానిటేషన్ ఏర్పాట్లు, ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించినారు. శ్రీ కొండలమ్మ అమ్మవారి దర్శనమునకు గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ కుటుంబ సమేతముగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకొనినారు. శ్రీ అమ్మవారిని దర్శించుకోనుటకు విచ్చేసిన భక్తులకు ఏ విధమైన అసౌకర్యములు, అవాంఛనీయ, సంఘటనలు కలగకుండా గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ, వారి సిబ్బంది తగు బందోబస్తు ఏర్పాట్లు చేసినారు.

**హుండీ లెక్కింపు :** ది.16.09.2025 మంగళవారం హుండీ లెక్కింపు కార్యక్రమము దేవాదాయ శాఖ అధికారులు, గ్రామస్తుల సమక్షములో జరుగునని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండల రావు ఒక ప్రకటనలో తెలియజేశారు.



# ప్రతి నియోజకవర్గంలో బ్రాహ్మణ భవన్, కర్మల భవన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి




**విజయవాడ సెప్టెంబర్ 14 మేజర్ న్యూస్ :** ప్రతి నియోజకవర్గములో "బ్రాహ్మణ భవన్", కర్మల భవన్ ను ప్రభుత్వం ఏర్పాటు చెయ్యాలనీ విజయవాడ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రస్తుత గౌరవ అధ్యక్షులు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో హనుమాన్ పేట, శ్రీ రాజరాజేశ్వరీ కళ్యాణ మండపం, శ్రీ శంకర మఠంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్రములోని పలు జిల్లాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ బ్రాహ్మణులు రాజకీయముగా ఎదిగి సమాజ సేవ చెయ్యాలని విజ్ఞప్తి చేసారు. ఈ మేరకు సంఘ సభ్యులు కొన్ని తీర్మానములను ఏకగ్రీవంగా ఆమోదించారు. విజయవాడ, గన్నవరం విమానాశ్రయంనకు జాతీయ పతాక రూపశిల్పి, స్వాతంత్ర్య సమరయోధులు "శ్రీ పింగళి వెంకయ్య" పేరు పెట్టాలి. విజయవాడ, హనుమాన్ పేట, శ్రీ శంకర మఠం, శ్రీరాజరాజేశ్వరీ కళా పీఠమునకు పది సంవత్సరములు పైగా సేవలు చేసిన విజయవాడ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు, ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రస్తుత గౌరవ అధ్యక్షులు కొప్పరపు వెంకట బలరామకృష్ణమూర్తి నివిజయవాడ, హనుమాన్ పేట శ్రీ శంకర మఠం శ్రీ రాజరాజేశ్వరీ కళా పీఠం ట్రస్ట్ అధ్యక్షులుగా నియమించాలి.మొదలగు తదితర తీర్మానములను ఏకగ్రీవముగా ఆమోదించటమైనది.ఈ కార్యక్రమములో పూర్వ అధ్యక్షులు ముత్తనపల్లి శివకృష్ణప్రసాద్, ఇసుకపల్లి కామేశ్వర ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షులు,గాలి శ్రీనివాస రావు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు, శ్రీవేదం హరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,ఉమామహేశ్వర రావు,తిరుపతి వేదం హరిప్రసాద్, రాష్ట్ర కోశాధికారి, మీడియా కోఆర్డినేటర్ హరనాథ్తదితర రాష్ట్ర వ్యాప్త కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# స్వర్గీయ మండలి విగ్రహానికి పులిగడ్డ గ్రామస్తులు ఘన నివాళి

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ గాంధీ, తెలుగు జాతి రత్నం స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం స్థానిక వంతెన సెంటరులో మండలి వెంకటకృష్ణారావు విగ్రహానికి పులిగడ్డ గ్రామానికి చెందిన మండలి అభిమానులు, కూటమి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శత జయంతి ఉత్సవాల కమిటీ గాంధీ క్షేత్రం కమిటీల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వర్రావు, మతి శ్రీనివాసరావు రాయపూడి వేణుగోపాలరావు, యలవర్తి చిన్న, బచ్చు రఘునాథ ప్రసాద్,ఏ విశ్వనాథపల్లి పాప తది తరులు పాల్గొనగా, అనంతరం పులిగడ్డ టోల్గేట్ వద్ద ఉన్న స్వర్గీయ మండలి విగ్రహానికి, పులిగడ్డ వార్పు దగ్గర ఏర్పాటు చేసిన మండలి వెంకటకృష్ణారావు విగ్రహాలకు పులిగడ్డ గ్రామానికి చెందిన నాయకులు అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పులిగడ్డ గ్రామానికి చెందిన కూటమి నాయకులు మండలి వెంకటేశ్వరరావు, నాగిడి రాంబాబు, కొక్కిలిగడ్డ నాగబాబు, సింగోతు నాగమల్లేశ్వరరావు, మండలి శివప్రసాద్, మండలి దుర్గా శ్రీరామ్, మండలి మనోజ్, మండలి నాగ బాలాజీ, చెన్ను శివాజీ, నాగిడి వెంకటేశ్వరరావు, మండలి వెంకట సుబ్రహ్మణ్యం, చెన్ను బాబూరావు, నాగిడి శివ నాగేశ్వరరావు, తమ్మా నాగరాజు, చెన్ను రాంబాబు, భోగాది నాగమల్లేశ్వరరావు, గుంటూరు పెదబాబు, ఆరిగ సురేష్, మిట్టా రమేష్, నాగిడి రాంబాబు, బత్తుల శ్రీను, మాతంగి భవానీ బాబు, మండలి ప్రమోద్ కుమార్, ఆరిగ నానీ, మండలి బలరాం, ఆరిగ గోవిందరాజులు, మండలి దేవ సుధీర్, మండలి శ్రీనివాసరావు, గుంటూరు వినయ్ బాబు, మండలి వెంకట శేషగిరిరావు, మండలి శ్రీనివాసరావు, మండలి సోమ సుందరరావు, ప్రభాకరరావు, మండలి సురేష్, శ్రీనివాసరావు, మండలి ఉదయ భాస్కర్, మునగాల ఆనంద్ సాయి, మండలి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలి



### జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ లాకా వెంగళరావు యాదవ్

**విజయవాడ సెప్టెంబర్ 14 మేజర్ న్యూస్ :** జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమావేశం విజయవాడ గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో ఆదివారం జరిగింది. విలేకరుల సమావేశంలో జాతీయ అధ్యక్షులు డాక్టర్ లాకా వెంగళరావు యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఇచ్చిన హామీ మేరకు కుల గలన చేపట్టి బీసీ జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా బీసీలకు రక్షణ చట్టం కల్పించాలని రాష్ట్ర ముఖ్య మంత్రిని కోరారు. కేంద్ర స్థాయిలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్రిక శాఖ ఏర్పాటు చేయాలని, మహిళా బిల్లులలో బీసీ మహిళకు ప్రత్యేక సబ్కోట కల్పించాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం లభించి 78 సంవత్సరాల దాటిన అప్పటికి బీసీలలో ఉన్న 95% బీసీ కులాలు ఇంతవరకు చట్ట సభల్లో ప్రవేశించలేదు. కనుక చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నరసరావు, ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎలమందరావు, మరో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిఎస్సార్ యాదవ్, అన్నమయ్య జిల్లా అధ్యక్షురాలు డివిటి పద్మావతి కృష్ణాజిల్లా అధ్యక్షులు నగేష్, విజయవాడ జాతీయ, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు శీరం నాగమల్లేశ్వరరావు, విజయవాడ నగర అధ్యక్షురాలు భక్తుల గీత, యువజన సంఘం ఉపాధ్యక్షులు వారు నాగోల్ మీరా, మహిళా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లీ శ్రీదేవి, కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి కూచిపూడి వాసు దేవరావు, రాష్ట్ర యువజన కార్యదర్శి అమర్ లింగయ్య, విజయవాడ నగర మహిళా ఉపాధ్యక్షురాలు నాగూర్ బి రాణి, గజ్జల కిరణ్, సోషల్ మీడియా ఇన్చార్జి భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శిగా గన్నవరానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ జొన్నలగడ్డ పవన్ కుమార్ నియమించారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు అయిన డాక్టర్ లాకా వెంగళరావు యాదవ్ ని దశాబ్దాలుగా వారి సేవలను గుర్తించి, విజయవాడ నగర అధ్యక్షులు నగర మహిళా విభాగం, విభజన విభాగం వారు పెద్ద ఎత్తున గజమాలతో రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నరసరావు కలిసి పెద్ద ఎత్తున సన్మానించారు. అన్నమయ్య జిల్లా అధ్యక్షురాలకిన్ జ్ఞాపకను అందజేశారు.

# చిరస్మరణీయులు లంక వెంకటరత్నం

### 25వ వర్ధంతి సభలో ప్రముకుల ఘననివాళులు



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చిరస్మరణీయులు లంక వెంకటరత్నం అని పలువురు వక్తలు కొనియాడారు. కృష్ణాజిల్లా పరిషత్ మాజీ ఇన్చార్జి చైర్మన్, కాంగ్రెస్ ముఖ్యనాయకులు లంక వెంకటరత్నం (రత్తయ్య) 25వ వర్ధంతిని స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో కుమారుడు లంక కొండలు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన వర్ధంతి సభలో నాటి కాంగ్రెస్ నేతలు, వివిధ వర్గాల ప్రముకులు పాల్గొని లంక వెంకటరత్నం చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. చల్లపల్లిలో కాంగ్రెస్పార్టీ నేతగా, జిల్లా రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపుపొందిన ఆయన చల్లపల్లి ఎంపీపీగా, కృష్ణాజిల్లా పరిషత్ వైస్చైర్మన్, ఇన్చార్జి చైర్మన్ గా పనిచేసి పేరుప్రఖ్యాతులు సాధించారని తెలిపారు. చల్లపల్లిలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, యుపిపాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్గ్రేడ్ చేయటంతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. లక్ష్మీపురం సొసైటీ అధ్యక్షుడు యార్లగడ్డ సోమశేఖరప్రసాద్ (లంకబాబు) అధ్యక్షతన జరిగిన సభలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, జడ్పీమాజీ వైస్చైర్మన్ గొర్రె పాటి వెంకట రామకృష్ణ, ప్రముకులు మత్తి వెంకటేశ్వరరావు, మత్తి శ్రీనివాసరావు, హనుమానుల సురేం ద్రనాథ్ బెనర్జీ, మీర్ రిజ్వాన్, మోర్ల ప్రసాద్, యడ్ల మదుసూధనరావు, పరుచూరి వెంకటేశ్వరరావు, జివి.తాతారావు, దాసి సీతారామరాజు, వరదా హరిగోపాల్లు ప్రసంగించగా, ప్రముకులు మోర్ల రాంబాబు, నిడమానూరి దిలీప్ కుమార్, బొందలపాటి వీరబాబు, ముమ్మనేని నాని, ఆకుల స్వభూప్రసాద్, నూకల లక్ష్మయ్య, సజ్జా చలపతిరావు, అడపా రాంబాబు, రావి రాజేశ్వరరావు, రావి చిట్టి, కొడాలి మురళి, తుటారం ప్రసాద్ తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు. చల్లపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్కు లంక వెంకటరత్నం పేరు పెట్టాలనీ, చల్లపల్లిలో ఆయన కాం స్యవిగ్రహం ఏర్పాటుచేయాలని పలు ప్రతిపాదనలు చేశారు. తొలుత లంక వెంకటరత్నం – లక్ష్మీకాం తమ్మల చిత్రపటాలకు కుటుంబసభ్యులు, ప్రముకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# ఆర్డీటీపై జరుగుతున్న కుట్రలు ప్రజా సంక్షేమంపై దాడులు



### ఆంధ్ర ప్రదేశ్ మాదిగ రిజర్వషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణ రాజు

**విజయవాడ సెప్టెంబర్ 14 మేజర్ న్యూస్ :** రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) దశాబ్దాల పాటు గ్రామీణ ప్రజల అభివృద్ధికి, బలహీన వర్గాల సుస్థిర జీవితానికి ఆశాజ్యోతి వలె నిలిచిందని ఆంధ్ర ప్రదేశ్ మాదిగ రిజర్వషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణ రాజు అన్నారు. ఆదివారం ఏపీ ఎంఆర్పీఎస్ గాంధీనగర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా సేవా సంస్థలపై ప్రణాళికాబద్ధమైన దాడుల భాగంగా, ఆర్డీటీ పై జరుగుతున్న కుట్రలు అత్యంత విచారకరం అన్నారు. ఎఫ్ సిఆర్ఎ లైసెన్స్ రద్దు, నకిలీ ఆరోపణలు, మత మార్పిడి పేరిట వ్యాపిస్తున్న తప్పుడు ప్రచారం, ఆర్డీటీ గ్రామీణ ప్రాంతాల్లో ఆసుపత్రులు, మొబైల్ హెల్త్ యూనిట్లు, దివ్యాంగులకు ఆపరేషన్లు, విద్య పాఠశాలలు, హాస్టళ్లు, దివ్యాంగులకు ప్రత్యేక విద్యా పథకాలు, మహిళా సంఘాలు, ఉపాధి కార్యక్రమాలు, స్వయం ఉపాధి నిధులు, రైతులకు సహకారం. కుల, మత, వర్గ భేదం లేకుండా సేవలు – ఇది భారత రాజ్యాంగ సిద్ధాంతాలకే అంకితభావం సేవా రంగాన్ని రాజకీయంగా వాడుకునే వారు, నిస్వార్థంగా పని చేసే సంస్థలను భయపెడుతున్నారన్నారు. ప్రభుత్వాలపై ప్రజల్లో అసంతృప్తిని తగ్గించేందుకు, సేవా సంస్థలపై మళ్లించడం సరైనది కాదన్నారు. అంతర్జాతీయ నిధులపై నియంత్రణ పెంచే ప్రయత్నంమేనన్నారు. ఈ సందర్భంగా ఏపీ ఎంఆర్పీఎస్ తరఫున తమా డిమాండ్లను తెలియజేశారు. ఆర్డీటీ లైసెన్స్ పునరుద్ధరించాలని, సేవా సంస్థలపై కుట్రలు కొనసాగితే, వాటిని ప్రజా ఉద్యమంగా ఎదిరించేందుకు సిద్ధంగా ఉంటామన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని, న్యాయవ్యవస్థను న్యాయంగా కలవాలని మద్దతుదారులను కోరుతున్నాం అన్నారు. ఆర్డీటీ సేవలకు ప్రజల మద్దతు మరోసారి వినిపించాలని ప్రజలందరికీ పిలుపు నిచ్చారు. ఈ దేశం సేవా సంస్కృతి మీద నిలబడిందని, అలాంటి సంస్థలను రక్షించడం మన బాధ్యత అని అన్నారు. ఆర్డీటీ ను టార్గెట్ చేయడం వెనుక ఉన్న కుట్రలను ఎత్తిచూపే బాధ్యత ఏపీ ఎంఆర్పీఎస్ తీసుకుంటుందని, మనం మౌనంగా ఉంటే, రేపటి సేవా ఉద్యమాలన్నీ శబ్దం కోల్పోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ అధ్యక్షులు ఉండుర్తి సుబ్బారావు, వేగూరు విజయ్ కుమార్, యల పల్లి శ్రీనివాస్, పొలిమేర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## దేవినేని లక్ష్మిని పరామర్శించిన ఎమ్మెల్యే

**పామర్రు మేజర్ న్యూస్:** మండల పరిధిలోని అడ్డాడ గ్రామంలో దేవినేని లక్ష్మి ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటుండగా పామర్రు శాసనసభ్యులు వరల కుమార్ రాజా ఆదివారం ఆమెను పరామర్శించారు. స్థానిక పార్టీ నాయకులతో కలిసి లక్ష్మి గృహానికి వెళ్లి పరామ ర్శించిన ఎమ్మెల్యే ప్రస్తుతము ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతోపాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## రహదారుల అభివృద్ధికి కృషి



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో ప్రధాన రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఆదివారం అవనిగడ్డలో ఎమ్మెల్యేను చల్లపల్లి మండలం మంగళాపురం గ్రామస్థులు పీఏసీఎస్ అధ్యక్షులు పరుచూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కలిసి తమ గ్రామ ప్రధాన రహదారి అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ప్రతిపాదనలు పంపి ఉన్నాయని, ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే రోడ్డు నిర్మిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మంగళాపురం రోడ్డు సహా నియోజకవర్గంలో మరిన్ని రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్థులు సత్కరించారు.

## మస్తాన్ రావును పరామర్శించిన వైసీపీ నాయకులు



**పమిడిముక్కల మేజర్ న్యూస్:** పమిడిముక్కల జడ్పిటిసి సభ్యురాలు యేనుగ వెంకటరమణకుమారి భర్త, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యేనుగ మస్తాన్ రావు అనారోగ్యంతో బాధపడుతుండగా ఆ పార్టీ చెందిన పలువురు నాయకులు ఆయనను పరామర్శించారు. గత కొంతకాలంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా నాయకులు పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వాలంటరీ విభాగం జిల్లా అధ్యక్షులు పోలిమెట్ల వంశీ కృష్ణ, వైస్ ఎంపీపి కొడమంచిలి మహేష్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గొర్కిపూడి బుజ్జి, సీనియర్ నాయకులు కొణతం శివరామకృష్ణ, పమిడిముక్కల ఎంపీటీసీ సభ్యులు గుర్విందపల్లి వంశీ, మండల పార్టీ కార్యవర్గ సభ్యుడు బొల్లా యోగేష్ మస్తాన్ రావును పరామర్శించిన వారిలో ఉన్నారు.

## నూతన ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**పామర్రు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఉరుటూరు గ్రామ శివారు నల్లగుంటలో ఎబినేజర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పాస్టర్ స్పర్జన్ రాజు ఏర్పాటు చేసిన నూతన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఉచితంగా రక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో పాస్టర్ స్పర్జన్ రాజు మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆయనకు ఎల్లవేళలా ఏసుప్రభువు ఆశీస్సులు ఉండాలని మరిన్ని మంచి పనులు చేసేందుకు ఆయన ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.



## కొత్తపేట పిఎసిఎస్ ఛైర్మన్‌గా యలవర్తి చిన్న

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** కొత్తపేట శ్రీరామా పీఏసీఎస్ నూతన ఛైర్మన్ గా ఎంపికైన యలవర్తి రాజనాగ మునేశ్వరరావు (చిన్నా) ను పలువురు కలిసి సన్మానించారు. ఆదివారం మండల పరిధిలోని కొత్తపేట పిఎసిఎస్ నూతన ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన చిన్నాను విశ్రాంత పిఎసిఎస్ సెక్రటరీ మత్తి ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా చిన్న మాట్లాడుతూ త్రిసభ్య కమిటీ ద్వారా కూటమి ప్రభుత్వ సహకారంతో, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రోత్సాహంతో సంఘ అభివృద్ధికి, రైతులకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తామని చిన్నా తెలిపారు. ఈ సందర్భంగా సొసైటీలో పఠాన్ ఇమామ్ ఖాన్ రూ.30వేలు డిపాజిట్ చేయగా ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎస్ అధ్యక్షులు పూనాపరెడ్డి సుబ్బారావు, గౌస్, తదితరులు పాల్గొనగా సీఈఓ సజ్జా ధర్మతేజ, సిబ్బంది పర్యవేక్షణలో. చైర్ పర్సనుగా యలవర్తి చిన్నా, పర్సన్లుగా జెట్టి రాజేష్, బొప్పన శేషారావు బాధ్యతలు చేపట్టారు.

## కోలాహలంగా లంకమ్మ తల్లికి ఘటం బిందెలు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** దివిసీమ వాసుల కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజులుతున్న అవనిగడ్డ శ్రీ లంకమ్మ తల్లి ఆలయానికి ఘటంబిందెల మొక్కుబడులతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం అవనిగడ్డ శ్రీ లంకమ్మ అమ్మవారి ఘటంబిందెల మొక్కుబడులను ప్రత్యేకతగా చెప్పుకుంటారు. ఈ ప్రాంత వాసుల గృహాలలో ఏ శుభకార్యాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ తొలతగా గ్రామ దేవత అయిన వెంకమ్మ అమ్మవారికి చలి నైవేద్యాలు సమర్పించి ఘటం బిందెలు తలపై పెట్టుకొని గారెల దండలు మెడలో వేసుకుని, డప్పు వాయిద్యాలతో ఇంటి నుండి బయలుదేరి పురవీధులలో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని మొక్కుబడులను చెల్లించుకుంటారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడగా భక్తులతో అవసరమైన ఏర్పాట్లను ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

## పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించిన ఎమ్మెల్యే కుమార్ రాజా



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** మండల పరిధిలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఆరుగురు లబ్ధిదారులకు పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆదివారం అందజేశారు. మండల పరిధిలోని వెంట్రప్రగడ గ్రామానికి చెందిన కూచిపూడి దేవరాజుకు 1,43,502 రూపాయలు, జుజ్జవరపు ప్రణవ్ తేజ్ కు 36,327 రూపాయలు, కూచిపూడి సుబ్రహ్మణ్యం కు 70 వేల రూపాయలు, కూనపరెడ్డి కనకమహాలక్ష్మికి 23,920 రూపాయలు, మోపర్రు గ్రామానికి చెందిన పోలిమెట్ల శ్రీనివాసరావుకు 15, 803 రూపాయలు, పాములపాడు గ్రామానికి చెందిన తలకొండ నాగేంద్రబాబుకు 37,477 రూపాయల వంతున మంజూరైన చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితిని గూర్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజాతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, పార్టీ నాయకులు సూరపనేని వెంకట సత్యనారాయణ, కూచిపూడి వెంకట సుబ్బయ్య, తదితర నాయకులతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన సీడీఎస్, ఎన్‌డీఏ-ఎన్ఏ పరీక్షలు

### పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ






**విజయవాడ, సెప్టెంబర్ 14, మేజర్ న్యూస్ :** ఆదివారం విజయవాడలోని ఆరు కేంద్రాల్లో నిర్వహించిన యూపీఎస్సీ – నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ (2), కంబైన్డ్ డిఫెన్స్ అకాడమీ (2) పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ బిషప్ అజరయ్య బాలికల జూనియర్ కళాశాల, ఎస్ఆర్ఆర్–సీవీఆర్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ఎలాంటి లోటుపాట్లు లేకుండా అభ్యర్థులకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. సీడీఎస్ పరీక్షకు సంబంధించి 672 మందికి, ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ పరీక్షకు సంబంధించి 718 మంది అభ్యర్థులకు ఏర్పాట్లు చేయగా.. సీడీఎస్ పరీక్ష మూడు షిఫ్ట్‌ల్లోనూ, ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ పరీక్ష రెండు షిఫ్ట్‌ల్లో జరిగింది. సీడీఎస్ పరీక్ష మొదటి షిఫ్ట్‌లో 52.7 శాతం, రెండో షిఫ్ట్‌లో 53.1 శాతం, మూడో షిఫ్ట్‌లో 53.6 శాతం హాజరు నమోదు కాగా ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ మొదటి షిఫ్ట్‌లో 62.8 శాతం, రెండో షిఫ్ట్‌లో 62.7 శాతం హాజరు నమోదైంది. పరీక్ష నిర్వహణలో భాగస్వాములైన లైజనింగ్, సూపర్‌వైజింగ్ తదితర అధికారులతో పాటు రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యం, విద్యుత్, ప్రజా రవాణా, పోస్టల్ తదితర శాఖల అధికారులకు కలెక్టర్ లక్ష్మీశ అభినందనలు తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ కూడా నగరంలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.





# రౌడీషీటర్‌లకు, సస్పెక్ట్‌లకు కౌన్సిలింగ్ నిర్వహించిన పోలీస్ అధికారులు






**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనరేట్ పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, ఆదేశాల మేరకు పోలీసు కమిషనరేట్ పరిదిలోని అన్నీ పోలీసు స్టేషన్ల, టాస్క్ ఫోర్స్ కార్యాలయం లలో అయా పోలీసు అధికారులు వారి వారి సిబ్బందితో కలిసి ఆయా పోలీసు స్టేషన్ పరిదిలోని రౌడీషీటర్‌లకు, లా & ఆర్డర్, క్రైమ్ సస్పెక్ట్ లకు, చెడునడత కలిగిన వ్యక్తులకు వివిధ సమయాలలో కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందింది.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి అసాంఘిక కార్యక్రామాలలో పాల్గోవడం చేయరాదని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అంతేకాకుండా గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా సత్ ప్రవర్తన మార్గంలో నడవాలని, ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఎవ్వరైనా ఎక్కడైనా గొడవలు, ఇతర నేరాలలో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.





# టీటీడీ పేద బ్రాహ్మణుల సమస్యలపై దృష్టి సారించాలి

## ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

## ఆరోగ్య బీమాను తక్షణమే కలిపించాలి



**విజయవాడ, మేజర్ న్యూస్:** తిరుమల తిరుపతి దేవస్థానం లోని లడ్డు, ప్రసాదాల తయారీ విభాగంలో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న బ్రాహ్మణుల సమస్యలను పరిశీలించి, దశాబ్దాలుగా తాత్కాలిక ఉద్యోగులుగా ఉన్న వారిని వెంటనే పర్మెంట్ చేయడమే కాకుండా వారికి అవసరమైన ఆరోగ్య బీమాను తక్షణమే కలిపించాలని డిమాండ్ చేస్తూ ధార్మిక పరివార్ & బ్రాహ్మణ సంక్షేమ వేదికల ఆధ్వర్యంలో ప్రత్యేక ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. ఈ ఆందోళన కార్యక్రమాలలో భాగంగా టీటీడీ పేద బ్రాహ్మణుల సమస్యలపై దృష్టి సారించాలని కోరుతూ తదుపరి నేడు విజయవాడలోని సత్యనారాయణ పురం లోని బాలమురళికృష్ణ వీధి వద్ద ప్రాంగణంలో మహా రుద్రాభిషేఖాన్ని నిర్వహించారు. అలానే అమెరికా, కెనడా యుకె, ఆస్ట్రేలియా, సింగపూర్ దేశాల్లోని మా ధార్మిక పరివార్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో 146 నదీ జలాల మహా రుద్రాభిషేకాన్ని సెప్టెంబర్ మాసమంతా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ధార్మిక పరివార్ జాతీయ అధ్యక్షులు వివి రామారావు మాట్లాడుతూ గత 25 సంవత్సరములుగా దేవుని కైంకర్యాలలో భాగమై ఎంతో కీలకమైన ప్రసాదాల తయారీలో భక్తి శ్రద్ధలతో నిమగ్నమైన పోటు లోని లడ్డూ, ఇతరత్రా ప్రసాదాల తయారీ కార్మికులను దుర్భర జీవితాలను గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 25 సంవత్సరములకు పైగా పని చేసిన వారెందరో ఉన్నా ఇంత వరకూ వీరిని రెగ్యులరైజ్ చేయకపోవడం వలన వారికి ఉద్యోగులకు సమానంగా అందాల్సిన ఇతర ప్రయోజనాలు అందడం లేదని వివరించారు. ఎవరికైనా ఆనారోగ్యం వస్తే పట్టించుకొలేనంత దారుణ స్థితిలో కార్మికులు ఉన్నారని పేర్కొన్నారు. అదే సందర్భంలో టిటిడి లోని పలు ఇతర కార్మికులను దేవస్థాన యాజమాన్యం పలు సందర్భాలలో రెగ్యులరైజ్ చేసిందని పేద బ్రాహ్మణుల విషయంలో మాత్రం చొరవ చూపకుండా చిన్న చూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమలలో శ్రీవారి సన్నిధిలో ముఖ్యంగా అందరూ ఎంతో పవిత్రంగా భావించే లడ్డూ తయారీ పనిలో నిమగ్నమైన పేద బ్రాహ్మణ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చెయ్యాలని అలానే వారికి కూడా ఇతర టిటిడి ఉద్యోగస్థుల వలే ఆరోగ్య భీమా సదుపాయాన్ని వెంటనే కలిపించాలని డిమాండ్ చేశారు. దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్న ఈ కార్మికుల తరపున పోరాడాలని ధార్మిక పరివార్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక ల తరపున నిర్ణయించామని ఇందులో భాగంగా టిటిడి పేద బ్రాహ్మణుల సమస్యలపై దృష్టి సారించాలని కోరుతూ అమెరికా, కెనడా యుకె, ఆస్ట్రేలియా, సింగపూర్ దేశాల్లోని మా ధార్మిక పరివార్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక అద్వర్యం లో 146 నదీ జలాల మహా రుద్రాభిషేకాన్ని ఆయా దేశాలలో సెప్టెంబర్ 6 వ తేదీ, విజయవాడలోని సత్యనారాయణ పురం సెప్టెంబర్ 14న నిర్వహించామని వెల్లడించారు. రుద్రాభిషేక కార్యక్రమ అనంతరం కార్యక్రమంలో పాల్గొంటున్న బ్రాహ్మణులు ఈ సమస్యపై త్వరలోనే రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రితో పాటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ని కలిసి విజ్ఞాన పత్రాన్ని అందజేసి సమస్యలను పరిష్కారించాలని కోరబోతున్నామని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అనుసరించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. తర్వాత ధార్మిక పరివార్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక యన్ ఆర్ ఐ విభాగపు కార్యదర్శి వి రాధిక అమెరికా నుండి వర్చువల్ గా మాట్లాడుతూ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారం కోరుకుంటూ అమెరికా, కెనడా యుకె, ఆస్ట్రేలియా, సింగపూర్ దేశాల్లోని మా ధార్మిక పరివార్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక అద్వర్యం లో 146 నదీ జలాల మహా రుద్రాభిషేకాన్ని సెప్టెంబర్ మాసమంతా నిర్వహిస్తున్నామని తెలిపారు. ముందుగా సెప్టెంబర్ 6 తేదీన అమెరికాలోని కాలిఫోర్నియాలో మహా రుద్రాభిషేకాన్ని నిర్వహించామని తదుపరి ఆయా దేశాలలో వరుసగా నిర్వహించడం జరుగుతుందని వెల్లడించాలు.

అనంతరం ధార్మిక పరివార్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక వ్యవస్థాపకులు బాల శ్రీనివాస్ మాట్లాడుతూ బ్రాహ్మణ సంక్షేమ వేదిక, ధార్మిక పరివార్ అనే సంస్థలు బ్రాహ్మణుల యొక్క సంక్షేమానికి, ప్రగతికి, అభివృద్ధికి, ఐక్యతను సాధించడానికి ఏర్పాటైనవని అన్నారు. వీటితో పాటూ సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణుల కు తోడ్పాటు అందించడానికి, రాజకీయంగా ఎదగడానికి సంస్థలు దోహదపడుతున్నామని, వివాహ పరిచయ సమాచారం, ఉద్యోగ సమాచారం అందచేయడానికి, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు సులభంగా అందుకొనే విధంగా సహాయ సహకారాలను అందిస్తున్నామని తెలిపారు. పేద విద్యార్థులకు ఉపకార వేతనాల కోసం సహాయం అందించడంతో పాటూ బ్రాహ్మణులు వ్యాపార రంగంలో వృద్ధి చెందటానికి, అర్చకులు, పురోహితులతో పాటూ క్యాటరింగ్ రంగంలో పని చేస్తున్న బ్రాహ్మణులకు అవకాశాలు అందించడానికి ఈ సంస్థలు కృషి చేస్తున్నాయని వివరించారు. అలానే ఆరోగ్యపరమైన ఇబ్బందులతో భాద పడుతున్న వారికి రాయితీతో కూడిన మందులు, తక్కువ ఖర్చు తో హాస్పిటల్స్ లో అడ్మిట్ అయిన వారికి ట్రీట్మెంట్ ఇప్పించడం తో పాటూ ఆరోగ్య పరీక్షల కోసం ప్రత్యేకంగా డయాగ్నస్టిక్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం చేస్తున్నామని దీంతో పాటూ బ్రాహ్మణ సాహిత్యాన్ని ప్రోత్సహించి తద్వారా హిందూ ధర్మ పరిరక్షణ కు కృషి కూడా చేస్తున్నాయని చెప్పారు. అలానే బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న వివిధ సామాజిక సమస్యలు, వాటి పరిష్కారం కోసం రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల దృష్టికి తెచ్చే విధంగా బ్రాహ్మణ సంక్షేమ వేదిక తీవ్రంగా ప్రయత్నం చేస్తుందని బాల శ్రీనివాస్ తెలిపారు. వాటిలో ముఖ్యంగా అర్చకత్వాన్ని కులవృత్తిగా ప్రకటించడం, విదేశాలకు వెళ్లే విద్యార్థులకు ఆర్థిక సహకారం కోసం, బ్రాహ్మణ యువత, మహిళల కోసం స్వయం ఉపాధి పథకాలను ప్రోత్సహించడం,బ్రాహ్మణులకు ఆరోగ్య సంరక్షణ బాధ్యత తోపాటు ఆరోగ్య బీమా కల్పిస్తూ,. తెల్ల రేషన్ కార్డు ను అందచేయడం, బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్లను పునరుద్ధరించడం, వేద పాఠశాలల సంఖ్యను పెంచుతూ, వాటిని ఆర్థికంగా ఆదుకోవడం, బ్రాహ్మణులకు రాజకీయ ప్రోత్సాహం, వృద్ధ వేద పండితులకు, వృద్ధ మహిళలకు పెన్షన్ తోపాటు ప్రమాద భత్యం సహకారం, చిన్న దేవాలయాలలో ధూపద్రవ్య నైవేద్యాల కోసం ఆర్థిక సహకారం పెంచడం వంటి అనేక సమస్యలు ఉన్నాయని వివరించారు. ఈ సమస్యలన్నింటిపై ప్రభుత్వ దృష్టికి తీసుకొని వెళుతామని వారి ప్రతిక్రియలను పట్టి తదుపరి కార్యాచరణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాలలో ధార్మిక పరివార్ జాతీయ అధ్యక్షులు వివి రామారావుతో పాటూ ధార్మిక పరివార్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక యన్ఆర్ఐ విభాగపు కార్యదర్శి వి రాధిక, ధార్మిక పరివార్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక వ్యవస్థాపకులు బాల శ్రీనివాస్‌తో పాటూ టిటిడి పోటు లో పని చేస్తున్న బ్రాహ్మణ కార్మికులు, రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రదేశాల నుండి విచ్చేసిన సంస్థ ప్రతినిథులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వినతుల స్వీకరణ



**విజయవాడ, సెప్టెంబర్ 14, మేజర్ న్యూస్ :** సెప్టెంబర్ 15వ తేదీ సోమవారం కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను Meekosam.ap.gov.in వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చని.. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.



## మఠం శివాలయం పునః నిర్మాణానికి రెండు లక్షల విరాళాలు అందజేసిన దాతలు

**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 14, మేజర్ న్యూస్ :** పట్టణము పాలేటివొడ్డున వేంచేసియున్న శివ పంచాయతన క్షేత్రం మఠం శివాలయం (సంపూర్ణ కృష్ణ శిలలతో) పునఃనిర్మాణమునకుభక్తులు మిట్టపల్లి కృష్ణారావు వారి జ్ఞాపకార్థం వీరి ధర్మపత్ని విజయలక్ష్మి, కుమారులు కోటేశ్వరరావు, హనుమంతరావు, కుటుంబసభ్యులు సంయుక్తంగా ఆలయ కమిటీ సభ్యులకు 2,01,116/- ( 2 లక్షల 1 వెయ్యి నూట పదహార్లు ) విరాళముగా అందచేశారు. వారికి, వారి కుటుంబానికి పంచాయతన సహిత శివయ్య, కంచి పీఠాధిపతులైన శ్రీ శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి ఆశీస్సులు, అష్టైశ్వర్యాలు, భోగభాగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఎన్నో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో మీ వంతు సహాయ సహకారాలు అందిస్తూ ఉండాలని కమిటీ వారు మనసారా కోరారు.

## ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఈ సోమవారం కూడా విజయవాడ నగరపాలక సంస్థ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాల యంలో కూడా నిర్వహిస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ కు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గరలోని కార్యాలయంలో సంప్రదించవచ్చని ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులందరూ జోనల్ కార్యాలయలలో తో పాటు ప్రధాన కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంటారని, కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.



## గుంటుపల్లి సిఏ కన్వెన్షన్‌లో దశకోటి మహాయజ్ఞం

**విజయవాడ, మేజర్ న్యూస్ :**ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనటం వల్ల ప్రజలకు మానసిక ప్రశాంతత, సద్భావన కలుగుతుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. స్వామీ అభిషేక్ బ్రహ్మచారి మహారాజ్(వారణాసీ) ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని సీఏ కళ్యాణమండపంలో జరుగుతున్న శ్రీ విద్య దశ కోటి కుంకమార్చన మహాయజ్ఞం కార్యక్రమానికి ఎంపీ కేశినేని శివనాథ్ ఆదివారం విచ్చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామీ అభిషేక్ బ్రహ్మచారి మహరాజ్ ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం జాతీయ పురోగతి, ప్రపంచ శాంతి, పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం చేస్తున్న ఈ కుంకుమార్చన లో పాల్గొన్న మహిళలకు ఎంపీ కేశినేని శివనాథ్ అభినందనలు తెలిపారు. మహిళలు తల్చుకుంటే ఏమైనా సాధించగలరని, అమరావతి రాజధాని సాధనలో మహిళలు కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రాభివృద్ధి ఎలాంటి ఆటంకం లేకుండా సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మైలవరం నియోజకవర్గం ఇన్చార్జ్ నూతలపాటి బాలకోటేశ్వరరావు, గొల్లపూడి గ్రామ మాజీ వైస్ ప్రెసిడెంట్ చిగురుపాటి నాగరాజు, సోసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సంస్థ సభ్యులు ముత్తవరపు మురళీ లతో పాటు స్థానిక నాయకులు, మహిళ భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

# ప్రతి ఇంటికీ హైజీన్ కిట్లు..








**ప్రత్యేక కరపత్రాలతో డయేరియాపై అవగాహన కల్పిస్తున్నాం**

**క్షేత్రస్థాయిలోనే ప్రత్యేక అధికారుల నేతృత్వంలో బృందాలు**

**ట్రాకింగ్, ట్రీట్‌మెంట్ విషయంలో అప్రమత్తంగా ఉన్నాం**

**ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 14, మేజర్ న్యూస్ :** రాజరాజేశ్వరి పేటలో డయేరియాను కట్టడి చేసే చర్యల్లో భాగంగా పటిష్ట ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే ఇంటింటికీ మినరల్ వాటర్ సరఫరా చేస్తుండగా, ప్రతి ఇంటికీ హైజీన్ కిట్లు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. 11 వార్డు సచివాలయాలు, పరిసర ప్రాంతాల్లో ప్రజలకు సబ్బులు, హ్యాండ్ వాష్, ఫినాయిల్‌తో పాటు పది చొప్పున ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక కరపత్రాలతో డయేరియాపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. వైద్య శిబిరంలో, ఆసుపత్రిలోనూ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నటు తెలిపారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. అయితే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అధికారులు, సిబ్బంది చేస్తున్న సూచనలను ప్రజలు తప్పకుండా పాటించాలన్నారు. ఎవరికైనా రోగ లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా అధికారులు, సిబ్బంది సహాయంతో వెంటనే చికిత్స తీసుకోవాలని సూచించారు. కేసుల ట్రాకింగ్, ట్రీట్మెంట్ విషయంలో ప్రత్యేక ప్రణాళికతో వ్యవహరిస్తున్నామని తెలిపారు. విజయవాడ అర్బన్ పరిధిలోనూ ఎక్కడా డయేరియా వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఏ సహాయం కావాలన్నా, సమాచారం కావాలన్నా కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ (91549 70454) నంబరుకు కాల్ చేయవచ్చని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.







## దసరా మహోత్సవాల ఏర్పాట్లను నడుచుకుంటూ పరిశీలించిన సీపీ







**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ఎన్.టి.ఆర్. జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, ఇతర పోలీస్ అధికారులతో కలిసి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని వినాయ టెంపుల్ వద్ద నుండి ఏర్పాటు చేసిన క్యూలైన్స్‌లను ఆదివారం స్వయంగా నడుచుకుంటూ పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు సలహాలు అందించారు. అదే విధంగా వాహనాల కోసం ఏర్పాటు చేయు పార్కింగ్ ప్రదేశాల ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో నగర పోలీస్ కమీషనర్, ఇతర పోలీస్ అధికారులతో కలిసి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్స్‌లలో స్వయంగా నడుచుకుంటూ వెళ్లి బారిగేటింగ్, హోల్డింగ్ ప్రదేశాలను పరిశీలించి భక్తులు లోనికి వెళ్ళడానికి బయటకు రావడానికి ఏర్పాటు చేసిన మార్గాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. అదేవిధంగా వాహనాల పార్కింగ్ కోసం భవానీపురం, పున్నమిఘాట్ మొదలగు ప్రాంతాలలో అనువైన ప్రదేశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు, సలహాలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పశ్చిమ జోన్ ఇన్ ఛార్జ్ డి.సి.పి. జి.రామకృష్ణ, పశ్చిమ ఏ.సి.పి. దుర్గారావు, సౌత్ ఏ.సి.పి. డి.పావన్ కుమార్, ట్రాఫిక్ ఏ.సి.పి. జె.రామ చంద్రరావు, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ గురుప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

## సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం...

**కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈ నెల 15వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు.ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక– మీకోసం కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్ సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు.కావున ప్రజలు ఈ



విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కలెక్టర్ కోరారు.

## ఆంధ్రప్రదేశ్ ఎంపీల పనితీరులో మూడవ ర్యాంకులో నిలిచిన ఎంపీ బాలశౌరి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** 2024-25 సంవత్సరానికి సంబంధించిన లోక్‌సభలో ఆంధ్రప్రదేశ్ ఎంపీల పనితీరు నివేదికను పార్లమెంట్ ప్రతినిధులు విడుదల చేశారు. ఈ నివేదికలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మూడవ స్థానంలో నిలిచారు. లోక్‌సభలో 72 ప్రశ్నలు అడిగి, 18 చర్చల్లో పాల్గొన్నారు, హాజరు శాతం 79.41%గా ఉంది. ఈ అంశాల ఆధారంగా ఆయనకు మూడవ ర్యాంకు కేటాయించినట్లు పార్లమెంట్ వర్గాలు వెల్లడించాయి.

## మైత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హాస్టల్ బాలికలకు స్టీల్ ప్లేట్లు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆదివారం స్థానిక భాస్కరపురం ప్రాంతంలో ఉన్న ది ఎవిలిన్ హోమ్ ఫర్ గర్ల్స్ హాస్టల్"లో 75 మంది బాలికలు నివసిస్తూ షార్కీ హైస్కూల్లో విద్యనభ్యసిస్తున్నారు. ఈ బాలికల అవసరాలను గమనిస్తూ మైత్రి ఫౌండేషన్ తరచుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.ఈ క్రమంలో దాతలు తాండ్ర ఈశ్వర ప్రసాద్, రమాదేవి దంపతులు,తమ కుమార్తె జన్మదినాన్ని పురస్కరించుకొని, హాస్టల్ బాలికలకు అవసరమైన 16,000 రూపాయిలు విలువైన స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, పండ్లను మైత్రీఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ రోజు అందజేశారు.హాస్టల్ వార్డెన్ మణి మార్టిన్, ఫౌండేషన్ సభ్యులకు, దాతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు వేణు కుమార్, అధ్యక్షులు వరప్రసాద్, ఉపాధ్యక్షులు రిలాక్స్ ప్రసాద్, రామకృష్ణ మాస్టారు, అనిల్, సుధీంద్ర కుమార్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిన సందర్భంగా ద్వారకా తిరుమల వెంకన్న దర్శనం



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం 14 నెలల కాలంలో ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిన సందర్భంగా మండల పరిధిలోని హనుమంతపురం గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ లింగమనేని బాబురావు ఆధ్వర్యంలో ద్వారకా తిరుమలలోని బాలాజీ దర్శనానికి తరలి వెళ్లారు. బాబురావు ఆధ్వర్యంలో లింగమనేని యూత్ బృంద సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో ద్వారకాతిరుమలకు తరలి వెళ్లి శ్రీ వెంకటేశ్వరుని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల మనస్సులలో సుస్థిర స్థానం సంపాదించుకోవాలని ఈ సందర్భంగా స్వామివారిని కోరినట్లు బాబురావు తెలిపారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు **ఎన్.వెంకట్,** ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999